
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 8 । ఆగస్టు । 2024



13.002 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయానికి 8,023 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. జలాశయం బుధవారానికి 13.002 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,040
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,363
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,554
సవర (8 గ్రాములు)	రూ.52,432

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0 /25.2

జిల్లాలో గురువారం అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. వాతావరణంలో తేమ 75 శాతం ఉంది.

న్యూస్‌రీల్

చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలి

- కార్మికుల నిరసన ప్రదర్శన



నెల్లూరు (వీఆర్సీసెంటర్): చేనేతపై విధించిన జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పముజుల హరి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని గాంధీ బొమ్మ సెంటర వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. హరి మాట్లాడుతూ చేనేతపై 23 శాతం జీఎస్టీ విధించడంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. పలు సంఘాలు, కార్మికులు చేసిన పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా 11 రకాల చేనేత ఉత్పత్తులకు చట్టబద్ధత ఏర్పడిందన్నారు. ఈ నిబంధనలను పవర్‌లూమ్ యజమానులు ఉల్లంఘిస్తూ చేతి మగ్గాలపై చేయాల్సిన వస్త్రాలను మరమగ్గాలపై చేస్తున్నారని, దీంతో చేతన కార్మికులు భృతిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని గాంధీనగర్‌లో చేనేతకు చెందిన ఆప్కో భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని, చేనేత సంఘాల బకాయిలను వెంటనే చెల్లించాలని, చేనేత నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు కేవీ శేషయ్య, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కోశాధికారి నారాయణ, నాయకులు పముజుల చంద్రశేఖర్, రవీంద్ర, మాలకొండయ్య పాల్గొన్నారు.

581 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 581 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 851 బేళ్లు రాగా 581 బేళ్లను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 76,155 కిలోల పొగాకు విక్రయించగా రూ.2,13,13,359 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.204 లభించింది. సగటు ధర రూ.279.87 నమోదైంది. వేలంలో 14 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం రేపు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర పురపాలక సంఘ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఒ. ఆనంద్ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి సమస్యలపై వినతుల స్వీకరణ జరుగుతుందని కలెక్టరేట్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు వైద్యశాఖా మంత్రి పెద్దాస్పత్రికి రాక

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వైద్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ నెల 9న శుక్రవారం నగరంలోని సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)కి రానున్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆధునిక డయాలసిస్ కేంద్రాన్ని 9.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఆస్పత్రిలోని ప్రధాన సమస్యలు, రోగులకు అందుతున్న సేవలు పరిశీలిస్తారు. మధ్యాహ్నం నుంచి డాక్టర్లతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నివేదికలను డాక్టర్లు అందించనున్నారు.

చచ్చిపోయే దాకా జగన్‌కే ఓటు



వృద్ధురాలితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'నేను చచ్చిపోయే దాకా జగన్‌కే నా ఓటు' అంటూ ఓ వృద్ధురాలు భావోద్వేగంతో జైకొట్టారు. పట్టుదలకు వయస్సుతో పనేముంది. మనోధైర్యం, సంకల్పం గొప్పదైనప్పుడు పట్టుదల బలపడుతోంది. 80 ఏళ్ల వయస్సు ఉన్న అమీర్‌బీది దగదర్తి మండలం తడకలూరు. ఆ వృద్ధురాలు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిందనే ఆగ్రహంతో టీడీపీ నాయకులు ఆమె తలకు గాయాలయ్యేలా కొట్టారు. అయినా వారితో ఎదురొడ్డి పోరాడుతోంది. ఈ క్రమంలో ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన రూ.50 వేల చెక్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె నన్ను చంపేస్తామన్నా.. నేను జగన్‌కే జైకొడుతా అంటూ ఉక్కు సంకల్పాన్ని ప్రకటించడంతో మాజీ ఎమ్మెల్యేతో పాటు అందరూ అభినందనలు తెలిపారు.

ఇక పరేషన్

నిరుద్యోగులకు ఉపాధి కల్పన చేస్తానని పొట్ట కొట్టిన కూటమి ప్రభుత్వం

ఇంటి వద్దే సరుకుల పంపిణీకి మంగళం

- రేషన్ కోసం మళ్లీ పాత కష్టాలు
- షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి
- సరుకులు పక్కదారి పట్టే అవకాశాలు ఎక్కువ
- జిల్లాలో 438 ఎండీయూ వాహనాలు
- వీటిని నమ్ముకున్న నిరుద్యోగులు వీధుల పాలు
- వాహనాల ఈఎంఐలు చెల్లించలేక తిప్పలు



ఇంటి వద్దే రేషన్ అందుకుంటున్న కార్డుదారులు (ఫైల్)

జిల్లాలో ఎండీయూ వాహనాలు - 438

రేషన్ షాపులు	1,513
కార్డులు	7,33,520
60 ఏళ్లు దాటిన వృద్ధులు	1,70,108 మంది
దివ్యాంగులు	33,148 మంది
వితంతు మహిళలు	74,265 మంది
ఒంటరి మహిళలు	11,102 మంది

కూటమి ప్రభుత్వం ప్రజలకు రోజుకొక కష్టాన్ని తెచ్చి పెడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు రేషన్ కష్టాలు తీర్చాలని, రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేర్చాలనే గొప్ప సంకల్పానికి శ్రీకారం చుట్టింది. అదే సమయంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేయించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ విధానాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా జిల్లాలో లక్షలాది కుటుంబాలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. సరుకులు పక్కదారి పట్టించేందుకు డీలర్లకు మళ్లీ అవకాశం లభించింది. ఎండీయూ వాహనాల ద్వారా జీవనోపాధి పొందుతున్న నిరుద్యోగులు రోడ్డున పడ్డారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రేషన్ షాపుల వద్దే సరుకులు తెచ్చుకునే ప్రక్రియ దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఈ విధానంలో సరుకులు ఎప్పుడొస్తాయో.. ఎప్పుడు అయిపోతాయో తెలియదు. ఎంత మంది లబ్ధిదారులు ఉంటే.. అంత మందికి రేషన్ సరుకులు చౌకదుకాణాలకు చేరుతాయి. కానీ డీలర్లు సరుకులు అయిపోయాయని చెప్పి బ్లాక్ మార్కెట్‌కు తరలించే పరిస్థితి ఉండేది. పేదలకు సబ్సిడీ ధరలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సరుకులు ఇలా పక్కదారి పట్టిపోతుండడంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయడం ద్వారా బ్లాక్ మార్కెట్‌కు కళ్లెం వేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేషన్ సరుకుల బ్లాక్ మార్కెట్ దందాకు మార్గాలు తెరిచినట్లు అయింది. లక్షలాది కుటుంబాలకు పాత కష్టాలు పునరావృతం కానున్నాయి.

రోజుల తరబడి తిప్పట.. గంటల తరబడి నిరీక్షణ

గతంలో రేషన్ సరుకుల కోసం కార్డుదారులు చౌకదుకాణాల చుట్టూ రోజుల తరబడి చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఉండేది. ఈ రోజు బియ్యం వస్తే.. మిగతా సరుకులు మళ్లీ వస్తాయంటే.. అప్పుడు మళ్లీ వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ఇలా నాలుగైదు సరుకుల కోసం నాలుగైదు రోజులు తిరగక తప్పేది కాదు. ఇక సరుకుల కోసం థంబ్ పడలేదని, నెట్ సిగ్నల్ అందక క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉండేవి. ఇలా నెలలో నాలుగు రోజులు రేషన్ షాపుల చుట్టూ తిరగడమే లబ్ధిదారులకు పనిగా ఉండేది. కూలినాలి చేసుకునే లబ్ధిదారులు ఇందు కోసం పనులు మానుకుంటుండేవారు. ఇలా రేషన్ షాపుల చుట్టూ తిరగలేక సగం మంది సరుకులు తీసుకోకపోయినా.. తీసుకున్నట్లు నమోదు చేసి ఆ సరుకులను డీలర్లు బ్లాక్ మార్కెట్ చేస్తుండేవారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీతో తీరిన కష్టాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు పెట్టి ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ చేపట్టడంతో ప్రతి లబ్ధిదారుడు రేషన్ సరుకులు తీసుకునేవారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దనే ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండీయూ వాహనాలు ఇళ్ల ముంగిట వద్దకు వచ్చి సరుకులు పంపిణీ చేస్తోండేవి. దీంతో సరుకులు పక్కదారి పట్టే అవకాశం లేకుండా పోయింది. దీంతో రేషన్ సరుకుల బ్లాక్ మార్కెట్‌కు కళ్లెం పడింది.

ఎండీయూ ఆపరేటర్లపై ఒత్తిడి

ఎండీయూ వాహనాల ద్వారా ప్రస్తుతం బియ్యం మాత్రమే పంపిణీ చేయిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి నెల 1 నుంచి 17వ తేదీ వరకు రోజుకు 90 నుంచి 100 కార్డుదారుల చొప్పున నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా ఆదేశాలుండేవి. ప్రస్తుత ప్రభుత్వం ఎండీయూ వాహన ఆపరేటర్లపై ఒత్తిడి పెంచి 1 నుంచి 10వ తేదీ లోపే పంపిణీ చేయాలని ఒత్తిడి పెంచారు. దీంతో పేద వర్గాలకు సరుకులు అందే అవకాశం ఉండదు.

వెంటాడనున్న నిరుద్యోగం

గత ప్రభుత్వం రేషన్ సరుకులు ఇంటి వద్దకే పంపిణీ ప్రక్రియలో పారదర్శకత కోసం చేపట్టి ప్రక్రియలో భాగంగా అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేసి వారికి బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఎండీయూ వాహనాలను సమకూర్చింది. రేషన్ సరుకుల పంపిణీ ద్వారా వారికి నెలకు ఆదాయం కల్పించే విధంగా చర్యలు తీసుకుంది. ఇలా జిల్లాలో 438 మందికి ఉపాధి కల్పించినట్లు అయింది. అయితే కూటమి ప్రభుత్వం వీరి ఉపాధికి గండి కొడుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో వీరు రోడ్డు పాలు కానున్నారు. మళ్లీ నిరుద్యోగులుగా మారనున్నారు.

సరుకులకు మంగళం



గత ప్రభుత్వ హయాంలో ఆయా కార్డుదారులకు బియ్యంతో పాటు కిలో కందిపప్పు రూ.67లకు, అరకిలో చక్కెర రూ.17లకు ఇచ్చేవారు. జిల్లాలో నెలకు 1,050 మెట్రిక్ టన్నుల బియ్యం, 321 మెట్రిక్ టన్నుల చక్కెర, 733 మెట్రిక్ టన్నుల కందిపప్పు సరఫరా చేసేది. ప్రస్తుతం బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.175 నుంచి రూ.185 వరకు పలుకుతుంది. చక్కెర కిలో రూ.48 నుంచి రూ.55 వరకు ఉంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రెండు నెలలుగా కార్డుదారులకు రాయితీపై ఎక్కడా కందిపప్పు, చక్కెర ఇవ్వడం లేదు. బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. మరో వైపు ధరల నియంత్రణలో భాగంగా అంటూ రైతు బజార్లు, పలు హోల్‌సేల్ కిరాణా దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.150 విక్రయిస్తున్నారు. ఇది కూడా రేషన్ కార్డుదారులకు ఇచ్చే ధర కంటే రూ.83 అధికం. ఇది తమకు భారమవుతోందని, రేషన్ బియ్యంతో పాటు వంట సరుకులు పంపిణీ చేయాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అడగకుండానే బియ్యంతో పాటు కందిపప్పు, చక్కెర, గోధుమపిండి, వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇంతకంటే మిన్నగా పౌరసరఫరాల వ్యవస్థను తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలిచ్చారు. బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, చక్కెర, ఇతర సరుకులు కూడా రాయితీపై అందిస్తామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా ఆ హామీ ఆచరణకు నోచుకోలేదు. ఇంటి వద్దకు వచ్చి సరుకులు పంపిణీ చేసే వాహనాల ద్వారా ఉపయోగం లేదని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో చెప్పడం చూస్తే ఎండీయూలకు మంగళం పలికినట్లే.

7,33,520 మందికి కష్టాలు

జిల్లాలో 7,33,520 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ షాపులకెళ్లి సరుకులు తెచ్చుకునే కష్టాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని కార్డు లబ్ధిదారుల్లో 60 ఏళ్లు దాటిన వృద్ధులు 1,70,108 మంది, దివ్యాంగులు 33,148 మంది, వితంతు మహిళలు 74,265 మంది, ఒంటరి మహిళలు 11,102 ఇలా ఈ కేటగిరీల్లో దాదాపు 3 లక్షల మంది ఉన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి రేషన్ షాపులు ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. నడవలేని వృద్ధులు, దివ్యాంగులు రేషన్ సరుకుల కోసం అంతంత దూరం వెళ్లాలంటే పడే పాట్లు వర్ణణాతీతంగా ఉంటాయి. గతంలో ఎవరో ఒకరి ఆసరాగా వెళ్లి సరుకులు తెచ్చుకున్నారు. ఇక వితంతు, ఒంటరి మహిళలు అయితే బతుకుదెరువు కోసం కూలినాలి చేసుకోవాల్సింది. వీరంతా గతంలో రేషన్ సరుకులు కావాలంటే పనులు మానుకోవాలి.. లేదంటే సరుకులు వదులుకునే వారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకుల పంపిణీతో ఆ కష్టాలు వారికి తీరాయి. ఇప్పుడు పాత కష్టాలే రానుండడంతో సర్వత్రా ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



రేషన్ కోసం 20 కి.మీ. రాకపోకలు

మాకు రేషన్ దుకాణం వెలగపాడులో ఉంది. మా ఊరు నుంచి రేషన్ దుకాణానికి వెళ్లాలంటే కలిగిరి 5 కి.మీ., అక్కడి నుంచి వెలగపాడుకు 5 కి.మీ. లెక్కన 10 కి.మీ. వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. రానుపోను 20 కి.మీ. ప్రయాణం తప్పదు. గతంలో రేషన్ తెచ్చుకోవడానికి అనేక వ్యయప్రయాసలకు ఓర్చి ఇబ్బందులు పడే వాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయడంతో మా సమస్య తీరింది. కూటమి ప్రభుత్వంతో మాకు మళ్లీ కష్టాలు తప్పడం లేదు.

– నర్రావుల అంకిరెడ్డి, పెద్దఅన్నలూరు, కలిగిరి మండలం



దుకాణానికి తిరగక తప్పదేమో

మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. నాలుగు కి.మీ. దూరంలోని డీసీపల్లిలోని రేషన్ దుకాణం వద్దకు వెళ్లి ప్రతి నెలా సరుకులు తెచ్చుకోవాలి. ఒక్కసారి వెళ్తే డీలర్ లేకపోతే మళ్లీ మళ్లీ తిరగక తప్పదు. పనులు మానుకొని ఖర్చులు పెట్టుకొని రేషన్ సరుకుల కోసం తిరిగిన సందర్భాలు ఎన్నో ఏళ్లు ఉన్నాయి. నాలుగేళ్లుగా ఆ బాధలు తప్పాయనుకుంటే సరుకులు ఇచ్చే వాహనాలు నిలిపేస్తారని అంటున్నారు. మళ్లీ మాకు బాధలు తప్పేలా లేవు.

– ఎస్ రామసుబ్బమ్మ, ఖాన్‌సాహెబ్‌పేట, మర్రిపాడు మండలం



ఎండీయూ వాహనాలను కొనసాగించాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఈ కొత్త ప్రభుత్వం కూడా రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారానే సరుకులను పంపిణీ చేయాలి. గ్రామానికి ఎంతో దూరంగా ఉన్న రేషన్ షాపుకు వెళ్లాలంటే నా లాంటి మహిళలకు ఎంతో ఇబ్బంది. ఇది తెలిసే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటికే రేషన్ సరుకులు అందించేకు ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి ఆ ఇబ్బందులు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ సరుకుల పథకాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం బాధాకరం.

– పాశెపు అరుణ, గృహిణి, చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు మండలం

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడాలి



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

- ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ
- ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

నెల్లూరు (దర్గామిట్ట): దేశం గర్వించేలా 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను రెపరెపలాడించాలని జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వీఆర్సీ మైదానం నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు స్వాతంత్ర్య దినోత్సవ మహోత్సవ ర్యాలీని బుధవారం ఇన్‌చార్జి జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్న హర్‌ఘర్ తిరంగా మహోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఆర్డీఓ మలోల, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, టీపీఆర్ఓ ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

కోవూరు: ఇంట్లో నిద్రపోతున్న పసిబిడ్డను కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.6 వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కాత్యాయిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంకు చెందిన తుమ్మల శ్రీను మూడేళ్ల కుమార్తె ఇంట్లో నిద్రపోతుండగా 2023 ఆగస్టు 8న ఇద్దరు ఆగంతకులు అపహరించుకుని వెళ్లారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి కొడవలూరు ఎస్సై సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జెండాదిబ్బకు చెందిన చలంచర్ల వెంకటరమణమ్మ భర్త చనిపోయాడు. ఆమె చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తుండేది. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన ఆవుల రాజీవ్ కూడా చిత్తు కాగితాలు ఏరుకుంటూ ఉంటాడు. వీరిద్దరికీ నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి ఆ చిన్నారిని అపహరించినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మాల్యాద్రి వాదించారు.

పీఏసీఎస్‌లను లాభాల్లో నడిపించాలి

- ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలో ఉన్న 51 పీఏసీఎస్‌లను లాభాల్లో నడిపించేలా సహకార శాఖాధికారులు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి, ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని డీసీసీబీలో బుధవారం బ్యాంకు మహాజన సభ నిర్వహించారు. సూర్యతేజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణను వేగవంతం చేసి అక్టోబరు 2వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు. పీఏసీఎస్ సంఘాలు, బ్యాంకు బ్రాంచ్‌ల్లో వాయిదా మీరిన బకాయిల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల ఆదాయం పెంపుదలకు కామన్ సర్వీస్ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ సేవలు, పెట్రోలు బంకులు, జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసి నిర్వహించాలన్నారు. జిల్లాలో పూర్తయిన 43 బహుళ ప్రయోజన సౌకర్య గిడ్డంగులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ సంస్థలకు అద్దెకు ఇవ్వాలని సూచించారు. పీఏసీఎస్ సంఘాలు బ్యాంకింగ్ సేవలతో పాటు, బంగారు ఆభరణాలపై రుణాలివ్వాలన్నారు. జిల్లాలోని పీఏసీఎస్ సేవలపై డీసీసీబీ విజన్ డాక్యుమెంటరీ రూపొందించాలని సూచించారు. అనంతరం తిరంగా ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, నాబార్డు మేనేజర్ బాబు, గూడూరు డివిజనల్ సహకారశాఖాధికారి రవిశేఖర్, సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, డీసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ అంజిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సూర్యతేజ

చేనేతల సంక్షేమానికి కృషి



గాంధీబొమ్మ సెంటర్ నుంచి చేనేత ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (బృందావనం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను చేనేత కార్మికులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను విరివిగా ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలన్నారు. పీఎంఈజీపీ, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్రధాన మంత్రి బిజీలీ యోజన సంక్షేమ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఆకాంక్షించారు. చేనేత వస్త్రాల గొప్పతనాన్ని చాటుతూ చేనేత కార్మికులు నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ ప్రదర్శనను కలెక్టర్ ఆనంద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రదర్శన గాంధీబొమ్మ నుంచి పురమందిరం వరకు సాగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్, జిల్లా సహకారి అధికారి గుర్రప్ప, చేనేత జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కాసా శ్రీనివాసులు, దేవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వాలు అండగా నిలవాలి

చేనేతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని ఆ సంఘ నేతలు డిమాండ్ చేశారు. పురమందిరంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. చేనేత సంఘ నాయకులు బూదాటి రాధయ్య, బాలాజీ, మన్యం సతీష్ తదితరులు మాట్లాడారు. చేనేతలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నేత బజారు ఏర్పాటు చేయాలని, సబ్సిడీతో రంగులు, రసాయనాలు అందించాలని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 11 రకాల చేనేత వస్త్రాలను హ్యాండ్లూమ్ మీదే తయారయ్యే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అమలు చేయాలన్నారు. జిల్లాలో 3,500 మగ్గాల మీద చేనేత వృత్తి సాగుతుందని వారందరిని చేనేత కార్మికులుగా గుర్తించాలన్నారు. ఆప్కోకు చెందిన 6.90 ఎకరాల స్థలంలో నేత బజారు, కల్యాణ మండపం, చేనేత శాఖ కార్యాలయం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అఖిలభారత పద్మశాలి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు రామనాథం రాజశేఖర్, సీహెచ్ పెంచలయ్య, కె.హరనాథ్, జి.వెంకయ్య వివిధ చేనేత అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వెంగమాంబ హుండీ కానుకల లెక్కింపు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలోని హుండీలను బుధవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. జూన్ 28వ తేదీ నుంచి బుధవారం వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు లెక్కించారు. రూ. 24,77,260 కానుకలు వచ్చినట్లు ఈఓ ఉషశ్రీ తెలిపారు. కొండబిట్రగుంట వెంకటేశ్వరస్వామి ఆల య ఈఓ రాధాకృష్ణ హుండీల లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్టేట్‌బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

• ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్య

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్య సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ నుంచి రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించని వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు వెయ్యి మంది ఉన్నారని, వీరికి నోటీసులిచ్చేందుకు వారం రోజులుగా సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి 200 మందికి జారీ చేశామన్నారు. కొంతమంది తప్పుడు చిరునామాలు ఇవ్వడంతో గుర్తించడం కష్టతరంగా మారిందన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 90
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 176
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 196
లేయర్ చికెన్	: 153

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

ప్రభుత్వ పెద్దలూ.. మా సంగతేంటి!

ప్రైవేట్ మద్యం దుకాణాలకే సర్కారు మొగ్గు

- అక్టోబర్ నెలలో కొత్త పాలసీ
- ప్రస్తుతం ప్రభుత్వ షాపుల్లో పనిచేస్తున్న వందలాది సిబ్బంది
- వారి భవిష్యత్ ప్రశ్నార్థకం
- దుకాణాల కోసం తెలుగు తమ్ముళ్ల ప్రయత్నాలు



నెల్లూరులోని ప్రభుత్వ మద్యం దుకాణం

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కొందరి పాలిట శాపంగా మారుతున్నాయి. వందలాది మంది చిరుద్యోగుల గురించి స్పష్టత ఇవ్వకుండా వారి జీవితాలను రోడ్డున పడే పరిస్థితి తెస్తోంది. ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నాయి. చంద్రబాబు సర్కారు ఆ పాలసీని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రైవేట్‌కే దుకాణాలను అప్పగించాలని మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మద్యం పాలసీని, అందులో లోటుపాట్లను పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిటీలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి స్థితిగతులను పరిశీలించి మరికొద్దిరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నాయి. అక్టోబర్ ఒకటి నుంచి నూతన పాలసీని అమల్లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ప్రస్తుతం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మా సంగతి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ హయాంలో ఇలా..

2019 ముందు వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 348 మద్యం దుకాణాలు, 50 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండేవి. రోజూ రూ.3.50 కోట్లకు పైగా మద్యం విక్రయాలు సాగేవి. పండగ వేళల్లో రూ.4 కోట్ల మేర విక్రయాలు జరిగేవి. ప్రతి రెండేళ్లకూ ఒకసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయించేవారు. అత్యధికంగా ఆదాయం వచ్చే దుకాణాలన్నీ నాటి రాజకీయ నేతల కనుసన్నల్లో నడిచేవి. ఒక్కో దుకాణానికి అనుబంధంగా నాలుగు నుంచి ఐదు అనధికార బెల్టు దుకాణాలు ఉండేవి. చిన్నపాటి అంగళ్లు, దాబాల్లో మద్యం 24 గంటలూ అందుబాటులో ఉండేది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నెలకొల్పింది. ప్రస్తుతం జిల్లాలో (కందుకూరుతో కలిపి) 193 మద్యం దుకాణాలు, 50 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి.

పరిశీలన ఎలా?

నూతన మద్యం పాలసీ అమల్లోకి వస్తే మద్యం దుకాణాల పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను రెండుగా (ఎస్ఈబీ, ఎక్సైజ్) విభజించిన విషయం విదితమే. ఎక్సైజ్ శాఖ మద్యం డిపోల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతలను పర్యవేక్షిస్తోంది. జిల్లాలో ఒక డిపో మేనేజర్, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 25 మంది సిబ్బంది ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన పాలసీ ప్రకారం ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటైతే ఉన్న అరకొర సిబ్బందితో వాటిని పరిశీలించడం కష్టతరం. దీంతో ఎస్ఈబీని, ఎక్సైజ్‌ను కలిపివేయనున్నట్లు తెలుస్తోంది.



ఆందోళనలో సిబ్బంది

ప్రైవేట్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతుండడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కో దాంట్లో సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. దుకాణాలకు వాచ్‌మెన్లు సైతం ఉన్నారు. మొత్తంగా జిల్లాలో 650 మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటైతే వారి మనుషులతోనే నిర్వహిస్తారు. దీంతో తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన సిబ్బందిలో మొదలైంది.

వారికే షాపులు

అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ దుకాణాలకు తొలగించి గతంలోలా ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కూటమి నేతలు ఇప్పటి నుంచే షాపులను దక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో తమకు తెలియకుండా ఎవరూ దుకాణాలకు యత్నించరాదని ఇప్పటికే అధికార పార్టీ నేతలు హుకుం జారీ చేసినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. దీనిని బట్టి చూస్తే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటు ఖాయమని తెలుస్తోంది. ఇదే జరిగితే 2014–19 నాటి పరిస్థితులే పునరావృత్తం కానున్నాయి. ఇదిలా ఉంటే ప్రైవేట్ షాపుల విషయంలో టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే సందేహాలు మద్యం వ్యాపారుల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలోలా లక్కీడిప్ ద్వారా షాపులు కేటాయిస్తారా? టెండర్ల ప్రక్రియను బార్లకు నిర్వహించినట్లు ఆన్‌లైన్‌లోనే వైన్‌షాపులకు నిర్వహిస్తారా? అనేవి తేలాల్సి ఉంది.

లెక్క తేల్చేందుకు..

సెప్టెంబర్ 1 నుంచి 21వ అఖిల భారత పశుగణన

- పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- సిబ్బందికి ఈనెల 10 వరకు శిక్షణ



నెల్లూరు(అర్బన్): కోళ్లు, బాతులు, పందులు, గేదెలు, గొర్రెలు, మేకలు లాంటి అన్ని రకాల జీవాల గణనకు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా జరిగే 21వ అఖిల భారత పశుగణన వచ్చే నెల 1నుంచి జిల్లాలో మొదలుకానుంది. ఈ ఫలితాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పశుసంపదను వృద్ధి చేసేందుకు పలు రాయితీలు ప్రకటిస్తాయి. గణనకు సంబంధించి మంగళవారం నుంచి జిల్లాలో ఆ శాఖ సిబ్బందికి, సూపర్‌వైజర్లకు శిక్షణ ప్రారంభమైంది.

డివిజన్ల వారీగా శిక్షణ

జిల్లాలో నెల్లూరు, కావలి, కందుకూరు పశుసంవర్థక శాఖ డివిజన్లున్నాయి. నెల్లూరులో మంగళవారం ప్రారంభమైన శిక్షణ బుధవారం ముగిసింది. కావలి డివిజన్‌లో 8, 9 తేదీల్లో, కందుకూరు డివిజన్‌లో 10వ తేదీన శిక్షణ పూర్తవుతుంది. రోజుకు 80 నుంచి 90 మందికి ఇస్తారు. గణనకు ఎన్యుమరేటర్లుగా 346 మంది పశుసంవర్థక శాఖ సిబ్బందిని, మరో 70 డాక్టర్లు, ఏడీలను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఒక్కొక్కరు గ్రామీణ ప్రాంతంలో రెండు వేల ఇళ్లను, పట్టణాల్లో మూడు వేల ఇళ్లను నేరుగా పరిశీలించి సర్వే చేస్తారు. రైతుల పెంచుకుంటున్న పశువులు, కోళ్లు, కుక్కలు అన్నింటిని లెక్కిస్తారు. అలాగే వారు వినియోగిస్తున్న పనిముట్ల గురించి నమోదు చేస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా నమోదు చేస్తారు. సర్వే చేసిన ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటిస్తారు.



శిక్షణలో మాన్యువల్‌ను ఆవిష్కరించిన అధికారులు

జిల్లాకు మెరుగైన స్థానం

గుడ్లు వినియోగించడంలో జిల్లా రాష్ట్రంలోనే ఒకటో స్థానంలో, పాలు వినియోగించడంలో 5వ స్థానంలో, మాంసం వినియోగించడంలో 4వ స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు. నెల్లూరు గొర్రెలకు ప్రత్యేక గుర్తింపు దక్కింది.

2019 గణాంకాలను చూస్తే..

తెల్ల పశువులు	1,15,966
గేదెలు	6,24,654
గొర్రెలు	10,51,955
మేకలు	3,51,546
పందులు	5,358
కోళ్లు	11,81,503

ప్రజలు సహకరించాలి



పశుగణనలో భాగంగా తమ సిబ్బంది చేసే ఇంటింటి సర్వేతో రైతులు, వ్యవసాయ కూలీల సామాజిక ఆర్థిక స్థితిని అంచనా వేసేందుకు వీలవుతుంది. పశు సంపద తగ్గిన చోట వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. పథకాలు, రాయితీల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. పశుగణనకు ప్రజలందరూ సహకరించాలి.

– డాక్టర్ కోటేశ్వరరావు, జేడీ, జిల్లా పశుసంవర్థక శాఖ

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుడి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటేశ్వరరావు (మధ్యలోని వ్యక్తి)

నెల్లూరు(దర్గామిట్ట): సహచర సిబ్బంది, విద్యాశాఖ అధికారులు తనను వేధింపులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాలంటూ పి.వెంకటేశ్వరరావు అనే ప్రభుత్వ టీచర్ నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట కుటుంబసభ్యులతో కలిసి బుధవారం నిరసనకు దిగాడు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలోని సంతపేట ప్రభుత్వ మోడల్ స్కూల్లో సోషల్ టీచర్‌గా తాను పనిచేస్తున్నానన్నారు. సహచర ఉపాధ్యాయులు విద్యార్థులకు తనపై లేనిపోనివి చెప్పి దాడి చేయించారని ఆరోపించారు. దాడి చేసిన విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడు వత్తాసు పలుకుతున్నాడని చెప్పారు. కలెక్టర్ స్పందించి సహచర సిబ్బంది వేధింపుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మకూరులో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై కె.ముత్యాలరావు కథనం మేరకు.. బి.నరసింహారావు అనే వ్యక్తి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత శుక్రవారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి వారి సొంత గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడం, బీరువా తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సవర బరువైన బంగారు ఆభరణాలు, 750 గ్రాముల మూడు వెండి నాణేలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా జామాయిల్ తరలిస్తుండగా..

• లారీ స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం రెవెన్యూ పరిధిలో సర్వరాబాదు సమీపంలో ప్రభుత్వ భూముల్లో సాగు చేసిన జామాయిల్‌ను అక్రమంగా నరికి లారీలో తరలించేందుకు ప్రయత్నించగా బుధవారం అధికారులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. రెవెన్యూ పరిధిలోని 1284 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొన్నేళ్ల క్రితం జామాయిల్ సాగు చేపట్టారు. వీటిని నరికి లారీలో తరలించేందుకు చూస్తున్నారని గ్రామస్తులు వీఆర్వో వెంకట్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసు, అటవీ శాఖ అధికారులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి లారీని స్వాధీనం చేసుకున్నారు.

• మండలంలోని తిరుమలాపురం గ్రామ సమీపంలో అగ్రిగోల్డ్‌కు సంబంధించిన భూమిలో అక్రమంగా జామాయిల్ నరికి తరలిస్తున్నారని గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి



కృష్ణ (ఫైల్)

ఇందుకూరుపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.కృష్ణ బుధవారం మృతిచెందాడు. పోలీస్ సిబ్బంది కథనం మేరకు.. కృష్ణ పదిరోజుల క్రితం విధుల నిమిత్తం మోటార్‌బైక్‌పై వెళ్తూ యాగర్ల వద్ద ప్రమాదం జరిగి గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో చనిపోయాడు. కృష్ణకు భార్యాపిల్లలున్నారు. కానిస్టేబుల్ మృతిపట్ల ఎస్సై వీరేంద్రబాబు, సిబ్బంది సంతాపం తెలిపారు.

తమ్ముళ్ల ఒత్తిడి.. ఇసుక ట్రాక్టర్‌ను వదిలేశారు



ఇసుక ట్రాక్టర్

కందుకూరు: ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మండలంలోని పాలూరు ఇసుక రీచ్ నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేసేస్తున్నారు. బుధవారం పట్టణంలోని పోతురాజుమిట్ట వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు సమీపంలో ఉంచారు. టీడీపీ నాయకుల నుంచి ఫోన్లు రావడం, అక్రమ రవాణాదారుల నుంచి పోలీసులకు మామూళ్లు అందడంతో క్షణాల్లో ట్రాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు బహిరంగంగానే సహకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.